సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 10 । మార్చి । 2023



పచ్చని విద్యాలయం

బాసరలోని ట్రిపుల్‌ఐటీ కళాశాల పచ్చదనంతో కళకళలాడుతోంది. అధికారులు, విద్యార్థులు కాలేజీ ఆవరణలో 30వేలకుపైగా మొక్కలు నాటగా అవి ప్రస్తుతం ఏపుగా పెరిగాయి.

8లో▸

ఆరోగ్య ఉపకేంద్రాల తనిఖీ

ఇంద్రవెల్లి: జన ఔషధి దివస్‌లో భాగంగా గురువారం మండలంలోని ముత్నూర్, హీరాపూర్, సట్వాజీగూడ, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ తనిఖీ చేశారు. రోగుల సంఖ్య, రికార్డులు పరిశీలించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్, సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను గురువారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని వైద్యులకు సూచించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్‌పెల్లివార్ శ్రీధర్, శ్రీకాంత్, సంఘ బాధ్యులు సందీప్ రాథోడ్, రాహుల్, హరీశ్‌కుమార్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మాణిక్‌రావ్ ఠాక్రేకు సన్మానం



మాణిక్‌రావ్ ఠాక్రేను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను పార్టీ నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన పార్టీ సభలో పాల్గొనేందుకు మహారాష్ట్ర నుంచి వెళ్తున్న ఆయన ఆదిలాబాద్ పట్టణంలో కాసేపు ఆగారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు నరేశ్‌జాదవ్, అంబకంటి అశోక్, నగేశ్, దిగంబర్‌రావు పాటిల్, భూపెల్లి శ్రీధర్, శేఖర్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

12న సీవోఈలో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన గురుకులాల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 12న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటలకు నిర్వహించే సీవోఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. హాల్ టికెట్, ప్యాడ్, బ్లాక్, బ్లూ పెన్ వెంట తీసుకురావాలని, పూర్తి వివరాలకు 9849390495 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15న కార్లకు వేలం

ఇచ్చోడ: ఇచ్చోడ ఎక్సైజ్‌శాఖ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ రెండు కార్లకు ఈ నెల 15న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. గురువారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. టాటా జెస్ట్, మారుతి స్విఫ్ట్ కార్లకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

రిమ్స్‌లో ఘనంగా కిడ్నీ డే



మాట్లాడుతున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. డయాలసిస్ కేంద్రంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యపానం, ధూమపానం కారణంగా అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని, ముఖ్యంగా కిడ్నీలు దెబ్బతింటాయని తెలిపారు. ఆ తర్వాత అనేక రుగ్మతల బారిన పడే ప్రమాదం ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఐదు లీటర్ల నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు తానాజీ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేడు ప్రీబిడ్ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 10న జెడ్పీ సమావేశ మందిరంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు సందేహాలు నివృత్తి చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ సూచించారు. అగ్రజా టౌన్‌షిప్‌లోని ప్లాట్లతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. గతేడాది అగ్రజా టౌన్‌షిప్‌లో 362 ప్లాట్లకు వేలం నిర్వహించగా అన్నీ అమ్ముడుపోయాయని తెలిపారు. కొనుగోలు చేసిన 58 మంది డబ్బులు పూర్తిగా చెల్లించనందున అగ్రిమెంట్ రద్దు చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటికి ఈ నెల 17న తిరిగి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారికి ప్రీబిడ్ సమావేశంలో అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఆర్డీవో రమేశ్‌రాథోడ్, డీపీఆర్వో భీంకుమార్, ఆర్‌ఐ హన్మంతు తదితరులున్నారు.



జిల్లా ఉపాధికల్పన కార్యాలయం

39 రోజులుగా జైల్లోనే..

- లంచంతో పట్టుబడ్డ కేసులో ఉపాధికల్పన శాఖ అధికారులు, రిమ్స్ ఉద్యోగి..
- ఇద్దరి సస్పెన్షన్.. త్వరలో మరొకరు..
- అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి ఉత్తర్వులిచ్చే అంశంపై కొనసాగుతున్న విచారణ



ఏసీబీకి పట్టుబడ్డ ఇద్దరు ఉపాధికల్పనశాఖ అధికారులు, జూనియర్ అసిస్టెంట్ (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: జనవరి 31న.. ఓ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి రూ.2.25 లక్షల లంచం తీసుకుంటూ ఇద్దరు ఉపాధికల్పన శాఖ అధికారులు, రిమ్స్ ఉద్యోగి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన రోజు. ప్రధాన సూత్రధారి ఎంప్లాయ్‌మెంట్ అధికారి కిరణ్‌కుమార్‌తో పాటు ఈ అక్రమంలో భాగస్వాములైన జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి విజయలక్ష్మి, రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ తేజను ఏసీబీ అధికారులు ఆరోజే అరెస్ట్ చేశారు. కరీంనగర్‌లోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపర్చారు. ఆ తర్వాత జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా కరీంనగర్‌లోని జైలుకు తరలించారు. ఇది జరిగి 39 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వారు జైలు ఊచలు లెక్కబెడుతూనే ఉన్నారు. బెయిల్ మంజూరు కాలేదు. కేసు విచారణ కొనసాగుతోంది.

ఇక్కడే బెడిసిందా..!

జిల్లా ఉపాధికల్పన అధికారిగా కిరణ్‌కుమార్ కొన్నేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. దీంతో ఆయనకు ఇక్కడి వ్యక్తులతో సత్సంబంధాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే ఆయన రిమ్స్‌లోని ఓ ఉద్యోగితో కలిసి ఓ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని స్థాపించారనే ప్రచారం ఉంది. అంతేకాకుండా ఆ ఏజెన్సీకి పెద్ద మొత్తంలో పోస్టులు వచ్చేలా ఆయనే వ్యవహారం సాగించారనే అపవాదూ ఉంది. ఈ నేపథ్యంలోనే మిగతా ఏజెన్సీ నిర్వాహకులతో బెడిసిందనే ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా ఇన్నేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న ఈ అధికారి భారీగా అక్రమార్జన చేశారనే ప్రచారం ఉంది. ఆదిలాబాద్ శివారులో బినామీ పేర్లపై పెద్ద ఎత్తున భూములు కూడా కొనుగోలు చేశారని చెప్పుకొంటున్నారు. ఈ వ్యవహారాలన్నీ ఆయనకు బెడిసి కొట్టాయని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల్లో చర్చ ఉంది.

వర్క్ ఆర్డర్‌కు రూ.లక్షలు ఇవ్వాల్సిందే..

జిల్లాలో ఎంప్యానల్‌మెంట్‌లో గుర్తింపు పొందిన అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు సుమారు 20కి పైగా ఉన్నాయి. ఆయా ఏజెన్సీలకు వివిధ శాఖల్లో సుమారు 400లకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. రిమ్స్‌కు 24 పేషెంట్‌కేర్ ప్రొవైడర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు మంజూరయ్యాయి. వాటిని ఏదైన ఏజెన్సీకి అప్పగించడం ద్వారా నియామకాలతో పాటు వాటి నిర్వహణ చేపట్టాలి. ఆ పోస్టులను జిల్లాకేంద్రంలోని దుర్గం ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ దక్కించుకుంది. ఇందుకు సంబంధించి ఎంప్లాయ్‌మెంట్ అధికారి నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలి. ఆ కాపీని సంబంధిత శాఖ.. అంటే రిమ్స్ ఉన్నతాధికారికి ఏజెన్సీ నిర్వాహకుడు అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆ 24 పోస్టులకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను రిమ్స్ నుంచి సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుడు అందుకుంటాడు. పోస్టుల నియామకం అప్పుడు చేపట్టాలి. ఈ అలాట్‌మెంట్ ఆర్డర్ ఏజెన్సీకి ఇచ్చేందుకు ఎంప్లాయ్‌మెంట్ శాఖ అధికారి లంచం డిమాండ్ చేశారు. దీంట్లో మరో ఇద్దరు ఉద్యోగులు భాగస్వాములయ్యారు. మొత్తంగా ముగ్గురు ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ విషయంలో ఏసీబీ డీఎస్పీ భద్రయ్యను 'సాక్షి' వివరణ కోరగా.. కేసు విచారణ కొనసాగుతోందని, ముగ్గురు నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నట్లు వివరించారు.

అప్పట్లోనే సస్పెన్షన్ వేటు

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కేసులో పట్టుబడిన తర్వాత 48 గంటల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంటే సహజంగానే సర్కారు నుంచి సస్పెన్షన్‌కు గురవుతారు. కాగా, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి విజయలక్ష్మిపై పది రోజుల క్రితం వేటు పడగా, అప్పుడే రిమ్స్ ఉద్యోగి తేజపై కూడా ఇది అమలైంది. అయితే ప్రధాన సూత్రధారి కిరణ్‌కుమార్‌కు సంబంధించి ఇంకా సస్పెన్షన్ ఉత్తర్వుల జారీ విషయంలో స్పష్టత లేదు. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య ఆధ్వర్యంలో ఆరోజు దాడులు జరిగాయి. కాగా, ఆ కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో ప్రణీత సూచించారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీనగర్‌లోగల జెడ్పీ ఎస్ఎస్ (బాలికల)ను గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రూపులుగా విభజించి చదివించాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో తరచూ మాట్లాడే.. విద్యార్థినులు ఇంటివద్దా చదివేలా చూడాలని సూచించారు. హెచ్‌ఎం మంజుల, రాజేశ్వర్ తదితరులున్నారు.

విద్యార్థులకు రాగిజావ

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ప్రతిరోజూ ఉదయం రాగిజావ పంపిణీ చేయనున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. గురువారం డీఈవో కార్యాలయంలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 1,125 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే 71వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ 10 గ్రాముల జావ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ ఏడీ నర్సింహులు, ఉద్యోగులు రాజేశ్వర్, చందు పాల్గొన్నారు.

స్క్రాప్ విక్రయ వేలం రద్దును నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న వ్యాపారులు

కైలాస్‌నగర్: ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్క్రాప్ విక్రయ బహిరంగ వేలాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ వ్యాపారులు గురువారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. 9న బహిరంగ వేలం నిర్వహిస్తామని పత్రిక నోటిఫికేషన్‌లో ప్రకటించడంతో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన వ్యాపారులు డీడీలు తీసుకుని కార్యాలయానికి వచ్చారు. వేలం రద్దయినట్లు వారికి అధికారులు తెలుపడంతో ఆగ్రహించారు. వేలాన్ని వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ.. ఇప్పటికే పలుసార్లు టెండర్లు రద్దు చేశారని, తాము దూరప్రాంతాల నుంచి డీడీలు తీసుకువచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

'డబుల్' లబ్ధిదారుల ఎంపిక పూర్తి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

జైనథ్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి 131 ఇండ్లకు 131మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. 702 దరఖాస్తులు రాగా, 197మందిని అర్హులుగా గుర్తించామని చెప్పారు. భూమి, ఇండ్లు లేని నిరుపేదలకు ముందుగా ప్రాధాన్యం ఇచ్చి 197మందిలో 131మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. కాగా, డబుల్ బెడ్రూంలు నిర్మించి ఏడేళ్లయినా లబ్ధిదారులకు అందించకుండా గ్రామసభల పేరిట కాలయాపన చేస్తున్నారని పలువురు మండిపడ్డారు. గత జాబితాలో అర్హులుగా గుర్తించి, ప్రస్తుత జాబితాలో పేరు ఎలా తొలగించారని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామసభ ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నామని తహసీల్దార్‌కు వివరించారు. గ్రామసభలో సర్పంచ్ దుమాల దేవన్న, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న డీఈఈ జాదవ్ సుభాష్

నార్నూర్: అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే శాఖాపరమైన కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేయిస్తామని విద్యుత్‌శాఖ డీఈఈ జాదవ్ సుభాష్ పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చాలా గ్రామాల్లో రాత్రి పూట కొండీలు పెట్టి అక్రమంగా విద్యుత్ వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై మండలంలోని నిఘా ఉంచి పకడ్బందీగా కేసులు నమోదు చేయిస్తామని, భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాన్ని స్థానిక ఏఈఈ శ్రీనివాస్‌కు అందజేయాలన్నారు. ఎస్టీ, ఎస్సీలు 101 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఎల్‌ఈడీ బల్బులే వాడాలని సూచించారు. ఏడీఈ చంద్రశేఖర్, ఏఈఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఇంటి స్థలాలు ఇచ్చేవరకూ ఇక్కడే'

ఆదిలాబాద్ రూరల్: తమకు ఇంటి స్థలాలు ఇచ్చేవరకూ మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని 72 సర్వే నంబర్‌లో వేసుకున్న గుడిసెలు తొలగించబోమని ఆదివాసీ గిరిజనులు తేల్చిచెప్పారు. కొద్దిరోజుల క్రితం వీరు 72 సర్వే నంబర్‌లోని స్థలాన్ని అక్రమించుకున్న విషయం తెలిసిందే. ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని గతంలో అధికారులు కోరినా వారు నిరాకరించారు. ఇదే సర్వే నంబర్‌లో ఇంటి స్థలాలు కేటాయించాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం అక్కడికి వెళ్లారు. స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున ఖాళీ చేయాలని ఆదివాసీ గిరిజనులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కోర్టు నుంచి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువస్తే సదరు స్థలాన్ని ఇళ్లకు కేటాయిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి దీనిపై ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక జీవో తీసుకువచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అయినప్పటికీ 72 సర్వే నంబర్‌లోనే ఇంటి స్థలాలు ఇచ్చేదాకా ఖాళీ చేసే ప్రసక్తే లేదని, కోర్టు ఉత్తర్వులు వచ్చేదాకా ఇక్కడే ఉంటామని ఆదివాసీ గిరిజనులు తెగేసి చెప్పారు. ఎమ్మెల్యే వెంట డీఎస్పీ ఉమేందర్, సీఐలు రఘుపతి, పురుషోత్తంచారి, ఎస్సైలు ఉన్నారు.

పెండింగ్ గుబులు

- వాహన తనిఖీల్లో భాగంగా రెండేళ్ల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లో పోలీసులు ఓ వాహనదారుడిని ఆపారు. ద్విచక్ర వాహన పత్రాలు చూపించాలని అడిగారు. ఆన్‌లైన్‌లో చూసి రూ.1,100 పెండింగ్ చలాన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు వాహనాన్ని పక్కనబెట్టాలని చెప్పారు. చలాన్ చెల్లించాలని సదరు వాహనదారుడికి సూచించారు. దీంతో ఆ వ్యక్తి తన ద్విచక్ర వాహనానికి రోడ్డుపైనే నిప్పు పెట్టాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.
- నల్గొండ జిల్లాలో వాహనాల పెండింగ్ చలాన్లు చెల్లించలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలో అనేక మంది వాహనాలపై రూ.వేలల్లో పెండింగ్ చలాన్లు ఉన్నాయి. గతంలో ఓసారి ప్రభుత్వం రాయితీ కల్పించింది. దీంతో చాలామంది వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించారు. నిబంధనలు పాటించని వాహనాలపై మళ్లీ పోలీసులు చలాన్లు విధించగా రూ.కోట్లలో వాహనదారులు పెండింగ్‌లో ఉన్నారు.

- నిత్యం కొనసాగుతున్న వాహనాల తనిఖీ
- కఠినంగా పెండింగ్ చలాన్ల వసూళ్లు
- నిబంధనలు పాటించని వారిపై చర్యలు
- ఆందోళనలో వాహన యజమానులు



నంబర్‌ప్లేట్లు లేని వాహనాలకు నంబర్ ప్లేట్లు పెట్టిస్తున్న పోలీసులు (ఫైల్)

నమోదైన కేసుల సంఖ్య, జరిమానా వివరాలు

సంవత్సరం	కేసులు	జరిమానా	వసూలైంది
2022	1,53,828	రూ.4.56కోట్లు	రూ.3.25 కోట్లు
2023 (ఇప్పటివరకు)	32,676	రూ.96.50లక్షలు	రూ.28లక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. రోడ్డుపైకి వచ్చే వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచిస్తున్నారు. దీంతో రోడ్డుపై పోలీసులు కనిపిస్తే చాలా వాహనదారులు హడలెత్తిపోతున్నారు. పోలీసులను చూసి అక్కడే ఆగిపోతున్నారు. వారు వెళ్లే వరకు ముందుకు కదలడం లేదు. జరిమానాలకు భయపడి అత్యవసర పని ఉన్నా వాహనం తిప్పి వేరే రూట్లలో వెళ్తున్నారు. నిత్యం జిల్లా అంతటా పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తుండగా వాహనదారులు గాబరా పడుతున్నారు. ఇదివరకు వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పోలీసులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. లేనిపక్షంలో ఆ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. చలాన్ చెల్లిస్తేనే వాటిని వదిలిపెడుతున్నారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు

జిల్లా అంతటా నిత్యం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ వద్ద, కలెక్టర్ కార్యాలయం వెళ్లే దారి, గాంధీ పార్క్ ప్రాంతం, పంజాబ్ చౌక్, తాంసి బస్టాండ్, ఠాకూర్ హోటల్, సినిమా రోడ్, వినాయక్‌చౌక్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. అలాగే ఆయా మండల కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పెండింగ్ చలాన్లు ఉంటే ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఒకవేళ వాహనదారుడు చలాన్ చెల్లించకుంటే వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ–చలాన్ ద్వారా జరిమానా విధిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా వేస్తున్నారు. దీంతో వాహనదారులు నంబర్ ప్లేట్లకు మరకలు పూయడం, నంబర్ ప్లేట్లు తొలగించడం, వంచడం, నంబర్లు కనిపించకుండా ఏదోవిధంగా చేసి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నంబర్లు కనిపించకుండా చేస్తే..

వాహన నంబర్లు కనిపించకుండా చేస్తున్న వాహనదారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇదివరకు ఆదిలాబాద్ పట్టణంలో పలు కేసులు నమోదయ్యాయి. ట్రాఫిక్ పోలీసులతో ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులకు జరిమానా వేస్తున్నారు. కొంతమంది వాహనాల నంబర్లు కనిపించకుండా చేస్తుండగా గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో పలుసార్లు ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

నిబంధనలు తుంగలోకి..

నిబంధనలు పాటించని వాహనదారులపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నప్పటికీ వారి తీరు మారడం లేదు. గతేడాది జిల్లాలో 1,53,828 కేసులు నమోదయ్యాయి. వివిధ వాహనాలపై రూ.4.56కోట్లు పోలీసులు ఈ–చలాన్ ద్వారా జరిమానా విధించారు. ఇందులో రూ.3.25కోట్లు వసూలు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 32,676 కేసులు నమోదు కాగా, రూ.96.50లక్షలు ఈ–చలాన్ ద్వారా పోలీసులు జరిమానా వేశారు. రూ.28లక్షల జరిమానా వసూలు చేశారు. గతేడాది డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించి జిల్లాలో 5,443 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు వెయ్యి వరకు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. కాగా, వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు వెంట ఉంచుకోవాల్సి ఉండగా, చాలామంది నిబంధనలు పాటించడం లేదు. హెల్మెట్ ధరించాలని పోలీసులు చెబుతున్నా పట్టించుకోకపోవడంతో జరిమానా వేస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఎక్కువగా హెల్మెట్ ధరించని ఈ–చలాన్లే ఉన్నాయి. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్ చేసిన వారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. పెండింగ్‌లో ఉన్న చలాన్లను చెల్లించాలని సూచిస్తున్నాం.

– ఎం.అశోక్, ట్రాఫిక్ సీఐ, ఆదిలాబాద్

క్లుప్తంగా

నేడు ట్రిపుల్‌ఐటీలో మహిళా దినోత్సవం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశాన్ని నిర్వహించనున్నట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సమావేశంలో వీసీ వెంకటరమణ, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ ఐఏఎస్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

'సుగుణ'కు సుష్మాస్వరాజ్ అవార్డు



అవార్డు అందిస్తున్న బండి సంజయ్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సుష్మాస్వరాజ్ అవార్డుకు ఎంపికైంది. నాగసముద్రం గ్రామానికి చెందిన సుగుణ వ్యవసాయంలో సేంద్రియ సాగుతో పాటు విభిన్న రకాల పంటలు పండించి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆమెను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన సివిల్ జడ్జి

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం సివిల్ జడ్జి మారెంరెడ్డి అర్పిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశలో పలు అంశాలు బోధించారు. యువతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, దురలవాట్లకు గురైతే కలిగే దుష్పరిణామాలు, వాటి పర్యావసనాలకు లోనవుతున్న టీనేజ్ బాలికల తీరు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒకరిపై అడవి పందుల దాడి



గాయాలపాలైన ఆడే సంతోష్

నేరడిగొండ: మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆడే సంతోష్‌పై అడవి పందులు దాడి చేశాయి. గురువారం గ్రామ శివారులోని పొలం పనులకు వెళ్లగా అతడిపై అడవి పందులు దాడికి పాల్పడ్డాయి. గాయాలైన సంతోష్‌ను చికిత్స నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పచ్చని విద్యాలయం



బాసర ట్రిపుల్‌ఐటీలో పెరిగిన మొక్కలు, మైదానంలో పచ్చని గడ్డి

ఆహ్లాదం పంచుతున్న ట్రిపుల్‌ఐటీ

- హరితహారంలో నాటిన మొక్కలు..
- రోడ్లకు ఇరువైపులా పచ్చదనం
- క్యాంపస్ అంతా పచ్చని చెట్లు









భైంసా: చదువుల తల్లి సరస్వతీ నిలయమైన బాసరలోని ట్రిపుల్‌ఐటీ కళాశాల పచ్చదనంతో కళకళలాడుతోంది. క్యాంపస్ అధికారుల ప్రత్యేక శ్రద్ధకు అక్కడి సిబ్బంది, విద్యార్థుల కృషి తోడుకావడంతో పరిసరాలు ఒక్కసారిగా క్లీన్ అండ్ గ్రీన్‌గా మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఇక్కడి విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ క్యాంపస్‌లో 30వేలకుపైగా మొక్కలునాటారు. భవనాలకు వెళ్లే రహదారులు, క్యాంపస్ పరిసరాలు, మైదాన ప్రాంతం ఇతర చోట్ల మొక్కలు నాటారు. ప్రతి రోజు సమయం దొరికినప్పుడల్లా ట్రిపుల్‌ఐటీ సిబ్బంది, విద్యార్థులు, వాలంటీర్లు వాటిని సంరక్షిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్లపై చెత్తాచెదారం పారేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందంగా పెరిగిన ఈ చెట్లపై చుట్టు పక్కల నుంచి వచ్చే పిచ్చుకలు, పావురాలు ప్రతి సాయంత్రం సందడి చేస్తున్నాయి.

వచ్చిన వారల్లా మొక్కలునాటి...

ట్రిపుల్‌ఐటీకి వచ్చిన ప్రముఖులంతా మొక్కలునాటి వెళ్తున్నారు. ఏ కార్యక్రమానికి పిలిచిన ముఖ్య అతిథులుగా వచ్చినవారంతా ఈ క్యాంపస్‌లో మొక్కలునాటుతుంటారు. దీంతో మొక్కలు పెరిగి చెట్లుకు మారి పచ్చదనాన్ని పంచుతున్నాయి. అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇదే జిల్లాకు చెందిన వారు కావడంతో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హరితహారం ప్రతి విడతలోనూ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌కు వెళ్లి మొక్కలు నాటి వస్తున్నారు. హరితహారంలోనే కాకుండా ట్రిపుల్‌ఐటీ అధికారులు సుందరీకరణ కోసం సుదూర ప్రాంతాల నుంచి మొక్కలు తీసుకువచ్చి ఈ క్యాంపస్‌లో నాటారు. ప్రస్తుతం ఈ మొక్కలన్నీ పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

హరితహారం అవార్డు...

బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రభుత్వం హరితహారం అవార్డు ఇచ్చింది. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈనెల 7న ట్రిపుల్‌ఐటీ అధికారులు అవార్డు అందుకున్నారు. మంత్రి కేటీఆర్ ఈ ఏడాదిలో రెండు పర్యాయాలు బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చారు. ఇక్కడి అధికారులు క్యాంపస్‌లో మొక్కల పెంపకంతో పాటు ఈకో పార్క్, మొక్కల పెంపకం చూసి సంతోషం వ్యక్తం చేశారు. చదువుకునే క్యాంపస్‌లో పిల్లలంతా ఇష్టంగా నాటిన మొక్కలన్నీ పచ్చని చెట్లు అయ్యాయని ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని కేటీఆర్ అన్నారు.

అంతటా మొక్కలు నాటాం

ట్రిపుల్‌ఐటీ అంతటా మొక్కలునాటి పెంచుతున్నాం. హరితహారంలో గతంలో నాటిన మొక్కలన్ని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నాటిన మొక్కలను రోజు నీరుపట్టిస్తూ చుట్టు వాటికి కంచె ఏర్పాటుచేసి రక్షిస్తున్నాం. సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ట్రిపుల్‌ఐటీ రహదారుల వెంట నాటిన మొక్కలన్నీ పచ్చని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రతి ఒక్కరి సహకారం అందించడంతో ట్రిపుల్‌ఐటీలో నాటిన మొక్కలన్నీ చెట్లుగా మారి ఆహ్లాదం పంచుతున్నాయి.

– వెంకటరమణ, వీసీ ట్రిపుల్‌ఐటీ బాసర

మృతుడి బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

కుభీర్: మండలంలోని పాంగ్ర గ్రామానికి చెందిన యువకుడు నామద్కర్ దిలీప్(24) ఫిబ్రవరి 8న కనిపించకుండా పోయాడు. బుధవారం ఆయన శవం గ్రామశివారులోని చెరువులో లభించగా కుటుంబీకులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే గురువారం మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. దిలీప్ చెరువులో పడి చనిపోలేదని, పంటలకు పెట్టే విద్యుత్‌షాక్‌తో చనిపోతే శవాన్ని చెరువులో పారేశారని అనుమానం వ్యక్తం చేశారు. మృతిపై అనుమానం ఉందని, విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై ఎండీ షరీఫ్ చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కైరే దత్తా (45) మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కైరే దత్తా–నాగబాయి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో భార్య నాగబాయి ఈ విషయమై మందలించడంతో ఇరువురు గొడవపడ్డాడు. దీంతో భార్య ఇద్దరు కుమారులు శశికాంత్, బాలాజీలను తీసుకొని అదే గ్రామంలోని వారి పుట్టింటికి వెళ్లింది. వీరి పెద్ద కుమారుడు మురళి హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఇంట్లో ఉంటూ అతిగా మద్యం సేవించాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటో‌లే ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తెల్లవారు జామును చిన్న కొడుకు బాలాజీ ఇంటి వైపు వెళ్లగా తండ్రి ఉరేసుకుని కనిపించడంతో స్థానికులకు తెలిపాడు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. భార్య నాగబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర బృందం



భీమిని పాఠశాలలో బృందం సభ్యులు

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. సభ్యులు పాఠశాలలో రికార్డులు, మార్కుల నమోదు ప్రక్రియ, తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాసాగర్ అన్నారు. అనంతరం భీమిని ఉన్నత పాఠశాలతో పాటు జగ్గయ్యపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో పీఎంకేవీవై 4.0 షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. పదోతరగతి, ఐటీఐ పూర్తి చేసిన, ఐటీఐ మధ్యలో ఆపేసిన, కళాశాల మధ్యలో మానేసిన 16 నుంచి 45 సంవత్సరాల అభ్యర్థులు అర్హులన్నారు. ఎలక్ట్రిక్ డొమెస్టిక్ సొల్యూషన్స్, సోలార్ ఎల్‌ఈడీ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్ డెవలపర్ కస్టమైజ్డ్ కోర్స్, వెల్డర్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

డబ్బులు కాజేసిన క్యాషియర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఖాతాదారులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలు చేసి డబ్బులు కాజేసిన బ్యాంక్ క్యాషియర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆదిలాబాద్ మెయిన్ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పనిచేసిన ఎ.యుగేందర్ ఖాతాదారుల ప్రమేయం లేకుండానే డబ్బులు విత్‌డ్రా చేసినట్లు ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గుగులావత్ ఇందల్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బ్యాంక్‌లో మే 2022లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఆయన జూలై వరకు నలుగురు ఖాతాదారుల సంతకాలు ఫోర్జరి చేసి వారి అకౌంట్లలో నుంచి రూ.లక్షా 60వేలు విత్‌డ్రా చేశాడు. దీంతో మంజర సక్కుబాయి, ఓటేకర్ కరుణలు అనే ఇద్దరు ఖాతాదారులు బ్యాంక్‌లో ఫిర్యాదు చేశారు. అకౌంట్‌ల నుంచి డబ్బులు మాయమవుతున్నాయని తెలిపారు. దీంతో విచారణ జరిపి అప్పట్లోనే సదరు క్యాషియర్‌ను సస్పెండ్ చేశారు. కాగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కరెంట్ షాక్‌తో యువరైతు మృతి



రాజుల భీమేశ్(ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన రాజుల భీమేశ్(30) గురువారం పంటపొలంలో కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం.. భీమేశ్‌కు మేడిపల్లి పక్కనే ఉన్న ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఒకటిన్నర ఎకరం భూమి ఉంది. అందులో మొక్కజొన్న పంట వేసి అడవి పందులు రాకుండా పంట చుట్టూ కరెంటు తీగలు అమర్చాడు. ఉదయం మొక్కజొన్నకు నీరు పారించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న తోట యజమాని గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిశీలించగా భీమేశ్ అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య అమత, పది నెలల బాబు ఉన్నాడు. రైతులు ఎవరు తమ పంట పొలంలో కరెంటు తీగలు పెట్టొద్దని, సోలార్ ఫెన్సింగ్ ద్వారా పంటను కాపాడుకోవాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లి.. కనిపించకుండా పోయాడు



శ్రీనివాస్ (ఫైల్)

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన బొంతల శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం ఈ నెల 4వ తేదీన ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు. ఎయిర్‌పోర్టులో దుబాయ్‌లోని ఏజెంటు కోసం వేచిచూశాడు. ఏజెంటు వచ్చేంతవరకు ధన్నూర్‌లోని ఆయన భార్య గీత (లావణ్య)తో పాటు ఇద్దరు కుమార్తెలతో వీడియో కాలింగ్‌లో మాట్లాడాడు. దాదాపు 12గంటల పాటు ఎయిర్‌పోర్టులోనే ఉన్నానని తెలిపాడు. కొంత సమయానికి మళ్లీ ఫోన్ చేస్తే కలవడం లేదని కుటుంబీకులు తెలిపారు. దుబాయ్‌లోని తమ బంధువులకు సమాచారం ఇవ్వడంతో దుబాయ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా గురువారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో భార్య గీత ఫిర్యాదు చేసింది. శ్రీనివాస్ జాడ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



మృతిచెందిన విజయేందర్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్(51) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విజయేందర్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో చోరీకి యత్నం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో సోలంకి రమేశ్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సదరు వ్యక్తి కాళ్లకు సంచులు కట్టుకుని చప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించాడు. గమనించిన పెంపుడు కుక్కలు అరవడంతో మేలుకున్న రమేశ్ ఇద్దరు కుమారులు దొంగను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం ఫిర్యాదు చేసేందుకు రమేశ్ భార్య పావని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సదరు దొంగ కనిపించలేదు. పోలీసులను ప్రశ్నించగా అతనికి మతిస్థిమితంలేదని, లారీ ఎక్కించి మహారాష్ట్రకు పంపించామని సమాధానం ఇచ్చారు. దొంగ పిచ్చివాడయితే పిచ్చాసుపత్రికి పంపించాలని, లారీలో ఎక్కించి మహారాష్ట్ర పంపించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను సంప్రదించగా దీనిపై తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

జీవాల వయస్సుకు తగ్గమేత

- పౌష్టికాహారంతో జీవాలు బలిష్టం
- ముక్కలుగా చేసి అందిస్తే మేలు



గొర్రెలు, మేకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు ఏ వయసులో ఎంత దాణా ఇవ్వాలి.. ఎండుగడ్డి, పచ్చిగడ్డి ఎంత మోతాదులో అందించాలి.. అనే విషయాలను పెంపకందారులు తెలుసుకోవడం చాలా అవసరం. మూగజీవాల వయసును బట్టి సరైన మోతాదులో ఆహారం అందిస్తే అవి బాగాఎదిగి బలిష్టంగా తయారవుతాయని, ఎండుమేతైనా, పచ్చిమేతైనా ముక్కలుగా చేసి అందిస్తే మేలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్‌కుమార్ సూచిస్తున్నారు.

చిన్నవయసు గొర్రె పిల్లలకు..

తల్లి పాలు తాగే వయసులో గొర్రె పిల్లలు కొరికి తినేందుకు వీలుగా ఎండిన లెగ్యూమ్ జాతి పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. 6 నుంచి 8 వారాల వయసు పిల్లలకు మధ్యగడ్డి, పప్పుజాతి ఎండుగడ్డి, నలగ్గొట్టిన గింజలు ఇవ్వాలి. 8 వారాల దాటిన తర్వాత తల్లి నుంచి పిల్లలను వేరు చేస్తారు. ఆ దశలో వాటికి క్రిపు దాణాను అందిస్తే త్వరగా ఎదుగుతాయి. ప్రతీరోజు ఒక్కో గొర్రె పిల్లకు 250 నుంచి 450 గ్రాముల దాణా, 2 కిలోల పచ్చిమేత అందేలా చూడాలి.

ఎదకు వచ్చిన సమయంలో..

గొర్రె ఎదకు వచ్చి పొర్లే సీజన్‌లో పప్పు జాతికి చెందిన ఎండుగడ్డితో పాటు రోజుకు 100 గ్రాముల ధాన్యపు గింజలు లేదా శరీర బరువులో 10వ వంతు పచ్చిమేత, 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

చూడికట్టిన సమయంలో..

చూడికట్టిన గొర్రెలకు సరైన మేత అందిస్తే పుట్టే పిలలు బలంగా ఉంటాయి. పాల దిగుబడి పెరుగుతుంది. అందుకే తినగలిగినంత ధాన్యపు జాతి పశుగ్రాసంతో పాటు రోజుకు 50 గ్రాముల వేరుశనగ చెక్క (పల్లిపొట్టు)అందించాలి. లేదంటే పొలాల్లో లభించే పంట అవశేషాలతో పాటు 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

ఈనే సమయంలో..

గొర్రె ఈనే సమయంలో ఆహారంలో ధాన్యపు గింజల పరిమాణం తగ్గించి నాణ్యమైన ఎండుమేత అందించాలి. ఈనిన తర్వాత నుంచి వారం రోజుల పాటు తౌడు, గింజల్ని 50 శాతం చొప్పున ఇవ్వాలి. పాలిచ్చే గొర్రెలకు ప్రతీరోజు 450 గ్రాముల ఎండుమేత , 250 గ్రాముల ధాన్యపు జాతి గింజల చొప్పున ఇవ్వాలి. లేదంటే 10 కిలోల పశుగ్రాసం అందించాలి. రెండేళ్ల పైబడ్డకా మేతతో పాటు ప్రతీరోజు 500 నుంచి 1000 గ్రాముల దాణా ఇవ్వాలి. పిల్లలు పుట్టిన తర్వాత 5 రోజుల పాటు జున్ను పాలు తాగించాలి. ఆ తర్వాత శరీర బరువులో 1/6వ వంతు చొప్పున నెల రోజుల పాటు పాలు తాగించాలి. రెండో నెల నుంచి శరీర బరువులో 1/15వ వంతు చొప్పున ఇవ్వాలి. పుట్టిన 2వ వారం నుంచి పిల్లలకు రుచికరమైన స్టార్టర్ దాణా, పచ్చిమేత ఇవ్వాలి. 3 నెలల వయసు నిండిన పిలలకు పాలు ఇవ్వడం మానేయాలి. 50 శాతం జొన్న, 25శాతం తౌడు, 12శాతం వేరుశనగ చెక్క, 11వెన్న తీసిన పాలపొడి, 2 శాతం ఖనిజ లవణ మిశ్రమంతో తయారు చేసుకున్న స్టార్టర్ దాణా అందించాలి. గొర్రెలు, మేకలకు దాణాతో పాటు ఖనిజ లవణ మిశ్రమం ఇవ్వడం వల్ల అవి ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. జీవాలు త్వరగా ఎదకు వస్తాయి. స్టాండర్డ్ కంపెనీలు చేసిన మిశ్రమాన్ని 2 శాతం మేర దాణాలో కలపాలి. లేదా విడిగా కూడా ఇవ్వవచ్చు. దాణాలో 1శాతం రాళ్ల ఉప్పును కూడా కలుపాలి.

ముక్కలు చేసి మేపాలి

పచ్చిమేత, ఎండుమేతలను అలాగే మేపితే జీవాలు వాటిని పూర్తిగా తినవు. పచ్చి పశుగ్రాసాల కాండాలు, చొప్పదంట్లు పెద్దవిగా లావుగా, ఆకులు వెడల్పుగా పొడవుగా ఉండడమే కారణం. జీవాలు కేవలం లేత ఆకుల్ని మాత్రమే పూర్తిగా తిని కాండాలు, దంట్లను వదిలేస్తాయి. అంతే కాకుండా వాటిని తొక్కి పాడుచేస్తాయి. మరోవైపు చొప్ప వంటి ఎండుమేత కొరత కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేతను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇందుకు మేతను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి మేపాలి. ఫారాల్లో పెంచే గొర్రెలు, మేకలకు పశుగ్రాసాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి అందించడానికి చాఫ్ కట్టర్, దాణా తయారు చేసుకోవడానికి గ్రైండర్ కమ్ మిక్సర్ ఉపయోగపడుతాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న చొప్పలను ఎండుమేతగా ఉపయోగించుకోవచ్చు.

నీటిని అందించడం ఇలా..

సాధరణంగా జీవాలకు వాటి శరీర బరువులో 10 శాతం నుంచి 12 శాతం నీరు అవసరమవుతుంది. కాబట్టి ప్రతీరోజు ఒక్కో జీవానికి సూమారు 5 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. ఫారాల్లో మేత తొట్లను ఏర్పాటు చేసినట్లు నీటితొట్లను కూడా ఏర్పాటు చేయాలి.

75 శాతం సబ్సిడీపై విత్తనాలు



స్వీట్‌సూడన్ గ్రాస్ ఎస్‌ఎస్‌జీ 898 రకం 5 కిలోల బ్యాగులను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తుకోవాలి. నాలుగు తడుల నీటితో 30 రోజుల చొప్పున నాలుగు సార్లు కటింగ్‌కు వస్తుంది. 30 నుంచి 40 టన్నుల వరకు పచ్చిమేత, 15 నుంచి 20 టన్నుల వరకు ఎండుగడ్డి దిగుబడి వస్తుంది. పూత దశకు వచ్చే సమయంలో కోతకోసి వాముగా నిల్వచేసుకోవచ్చు.

– జిల్లా పశువైద్యాధికారి

ట్యాక్స్ చెల్లించని ఇసుక ట్రాక్టర్లు సీజ్



నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య ఆదేశాల మేరకు గురువారం నెన్నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించకుండా ఆన్‌లైన్ ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక ఫ్లో ట్రాక్టర్, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు మంచిర్యాల అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలంటే ట్యాక్స్‌తో పాటు పన్నుపై 200 శాతం పెనాల్టీ కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనదారులు తమంతట తామే టాక్స్‌లను వెంటనే చెల్లించుకొని పెనాల్టీ నివారించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా అన్ని ధ్రువపత్రాలు ఉన్న ట్రాక్టర్లకే ఆన్‌లైన్‌లో ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాల్సిన మైనింగ్ శాఖ పట్టుబడ్డ ఈ ట్రాక్టర్లకు ఆన్‌లైన్ అనుమతి ఎలా ఇచ్చిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.